# కవితకు ఏడు రోజుల కస్టడీ

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): కవితకు న్యాయస్థానం వారం రోజుల ఈడీ కస్టడీ విధించింది. తిరిగి ఈ నెల 23న మధ్యాహ్నం 12 గంటలకు కోర్టులో హాజరు పర్చాలని ఆదేశించింది. ఆమెను విచారించే సమయంలో వీడియో రికార్డింగ్ చేయాలని స్పష్టంచేసింది. కుటుంబ సభ్యులు, న్యాయవాదులను రోజు సాయంత్రం 6 నుంచి 7 గంటల మధ్య కలుసుకోవచ్చని, భోజనం ఇంటి నుంచి తెప్పించుకోవచ్చని చెప్పింది. వైద్యుల సూచన మేరకు అవసరమైన మందులను తెప్పించుకోవచ్చని చెప్పారు. వైద్యులు పరీక్షించినపుడు కవిత హైబీపీతో బాధపడుతున్నట్టు గుర్తించారు. ఆదివారం కోర్టు నిర్దేశించిన సమయంలో కవిత భర్త అనిల్, కేటీఆర్, హరీశ్‌రావు, ప్రణీత్, న్యాయవాదులు కలిసే అవకాశం ఉన్నది.

**ఆధారాలను చెరిపివేసే ప్రయత్నం**

ఢిల్లీ మద్యం విధానం కేసులో కవిత ప్రమేయం ఉన్నదని నిర్ధారించేందుకు తమ వద్ద సంపూర్ణ ఆధారాలు ఉన్నాయని ఈడీ రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నది. ఈ కేసులోని ప్రధాన సూత్రధారులు, లబ్ధిదారుల్లో ఆమె ఒకరని తెలిపింది. అనుకూలమైన మద్యం విధానాన్ని రూపొందించి అమలు చేసేందుకు శరత్ రెడ్డి, మాగుంట రాఘవరెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డి తదితరులు ఆమ్‌ఆద్మీ పార్టీలోని ప్రధాన నేతలతో రూ.100 కోట్ల మేర ఒప్పందం చేసుకున్నారని ఆరోపించింది. కవిత నేరుగా ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాతో ఒప్పందం చేసుకున్నారని తెలిపింది. ఆమెతోపాటు మరికొందరు సౌత్ గ్రూప్ సభ్యులు కలిసి మధ్యవర్తుల ద్వారా చెల్లింపులు చేశారని వెల్లడించింది. ఇండో స్పిరిట్ సంస్థ ప్రతినిధి అరుణ్ పిళ్లై చెప్పిన అనేక విషయాలు ఈ కేసులో కవిత ప్రమేయాన్ని చూపుతున్నాయని తెలిపింది. 33 శాతం లాభాలు మేడమ్‌కు వెళ్తాయి అని బుచ్చిబాబు, అరుణ్ పిళ్లై, రాఘవ మాగుంట సహా నిందితులు స్టేట్‌మెంట్ ఇచ్చినట్టు పేర్కొన్నది. నిరుడు మార్చి 11న ఈడీ నోటీసులు ఇచ్చిన తర్వాత ఆమె ఆధారాలను ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారని ఆరోపించింది. నిరుడు మార్చి 21న కవిత తన స్టేట్‌మెంట్ రికార్డింగ్ సందర్భంగా 9 ఫోన్‌లను సమర్పించారని తెలిపింది. ఇవన్నీ ఫార్మాట్ చేసి ఇచ్చినవేనని పేర్కొంది. డాటా రికవరీ కోసం ఎన్ఎఫ్ఎస్‌యూకు పంపామని, ఆ నివేదిక ప్రకారం.. కవితకు నోటీసులు ఇచ్చాకే ఫోన్లను ఫార్మాట్ చేసినట్లు తేలిందని తెలిపింది. కవిత ఫేస్‌టైమ్‌ని వాడుతున్నట్టు ఒప్పుకున్నారని, కానీ ఈడీకి ఇచ్చిన ఫోన్లలో వాట్సాప్, ఫేస్‌టైం డాటా లేదని పేర్కొంది. ఈ కేసులో తన ప్రమేయం బయటపడొద్దనే ఉద్దేశంతోనే డాటాను డిలీట్ చేసినట్టు ఆరోపించింది.




హనుమకొండలో శనివారం నమస్తే తెలంగాణ-తెలంగాణ టుడే ఆటోషోను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, నమస్తే తెలంగాణ అడ్వర్‌టైజ్‌మెంట్స్ జనరల్ మేనేజర్ ఎస్ సురేందర్‌రావు తదితరులు

# ఆటో షోకు అనూహ్య స్పందన

- నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో హనుమకొండలో ఏర్పాటు
- ప్రారంభించిన శాసనమండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్, జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్

హనుమకొండ చౌరస్తా, మార్చి 16 (నమస్తే తెలంగాణ): నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే మీడియా సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండలోని కుడా హయగ్రీవాచారి మైదానంలో ఏర్పాటుచేసిన ఆటోషోకు విశేష స్పందన వచ్చింది. రెండురోజులపాటు నిర్వహించే ఆటో షో (కార్లు, బైక్‌ల ప్రదర్శన)ను శనివారం శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, జడ్పీ చైర్మన్ మారపల్లి సుధీర్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆటోషోలో మహావీర్ బెంజ్, మహావీర్ స్కోడా, కృష్ణ వోల్వో, ఆడి హైదరాబాద్, ప్రైడ్ జీప్, పీపీఎస్ వోక్స్‌వాగన్, విన్ టీవీఎస్, విన్ మోటార్స్, మోటార్‌లైన్ మహీంద్ర, మిత్ర సుజికి, కియా మోటార్స్, ఆదర్శ మోటార్స్, ఆదర్శ నెక్సా, గ్రీన్ హోండా, హ్యాపీ ఆటోమోటివ్ యమహా, హేమా హుందాయ్, ప్రైడ్ సిట్రోన్, ఎంజీ మోటార్స్, మహావీర్ జేఎస్‌యూజెడ్‌యూ యాజమాన్యాలు తమ లేటెస్ట్ కార్లు, ద్విచక్రవాహనాలను ప్రదర్శనలో పెట్టాయి. ప్రత్యేక స్టాళ్లను వాహన ప్రేమికులు, ప్రజలు సందర్శించారు. కారు, బైక్ మోడళ్ల వివరాలను ఆయా కంపెనీల ప్రతినిధుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. తమకు నచ్చిన కార్లు, బైక్‌లను కొనుగోలు చేశారు.

**'నమస్తే' చొరవ అభినందనీయం: ప్రకాశ్**

వాహన ప్రేమికులు అబ్బురపడేలా నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే హనుమకొండలో ఆటో ఎక్స్‌పో షో నిర్వహించడం అభినందనీయమని శాసనమండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్ చెప్పారు. అనేక దిగ్గజ కంపెనీలన్నింటినీ ఒకే వేదికపైకి తీసుకురావాలనే ఆలోచన గొప్పదని పేర్కొన్నారు. వాహనాల కోసం షోరూంలు తిరగాల్సిన అవసరం లేకుండా వినియోగదారులు ఇక్కడికి వచ్చి అన్ని స్టాళ్లు సందర్శించి తమకు నచ్చిన వాహనాలను కొనుగోలు చేయవచ్చని తెలిపారు. టెస్ట్‌డ్రైవ్ చేసి మరీ కొనే అవకాశం కల్పించినందుకు యాజమాన్యాలను, నిర్వాహకులను అభినందించారు. ఇలాంటి అనేక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని నిర్వాహకులను కోరారు.

**ఒకే వేదికపైకి వివిధ కంపెనీల వాహనాలు: సుధీర్**

వాహన ప్రేమికుల అభిరుచులకు అనుగుణంగా నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో ఆటోషో ఏర్పాటు అభినందనీయమని జడ్పీ చైర్మన్ మారపల్లి సుధీర్‌కుమార్ పేర్కొన్నారు. బైకులు, కార్లు కొనాలనుకునేవారి అవసరాలను గుర్తించి ఒకే వేదికపైకి వివిధ కంపెనీల వాహనాలు తీసుకురావడం చాలా సంతోషంగా ఉన్నదని చెప్పారు. ఇలాంటి వేదికలు ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటాయని, ఒకప్పుడు ఇలాంటి ఆటోషోలు మహానగరాలకే పరిమితయ్యేవని, ఇప్పుడు మన హనుమకొండలో కూడా అందుబాటులోకి తీసుకువచ్చారని చెప్పారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలను కాపాడటంలో ముఖ్య భూమిక పోషిస్తున్న నమస్తే తెలంగాణ.. మరోవైపు ఆటోఎక్స్‌పో షో వంటి ప్రదర్శనలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

**ప్రజల సౌకర్యార్థం ఆటోషోలు: సురేందర్‌రావు**

ప్రజల సౌకర్యార్థం అన్ని వాహనాలు ఒకే వేదిక పైకి తీసుకొచ్చేందుకు నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో ఆటోషోలు నిర్వహిస్తున్నట్టు నమస్తే తెలంగాణ అడ్వర్‌టైజ్‌మెంట్స్ జనరల్ మేనేజర్ ఎస్ సురేందర్‌రావు చెప్పారు. గతంలో కూడా ఇలాంటి షోలు ఢిల్లీ, హైదరాబాద్ వంటి మహానగరాలకే పెట్టేవారని, ఇప్పుడు మన నగరాల్లో కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అన్ని జిల్లాల్లో ఆటోషోలు నిర్వహించి వాహనప్రియుల కలను సాకారం చేస్తున్నామని తెలిపారు. ఇక ముందు కూడా మరిన్ని షోలు నిర్వహిస్తామని చెప్పారు. వీటికి అన్ని జిల్లాల్లో ప్రజల నుంచి విశేష స్పందన వస్తున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ పందిళ్ల అశోక్‌కుమార్, ఏజీఎం ఎం రాజిరెడ్డి, ఎడిషన్ ఇన్‌చార్జి కనపర్తి రమేశ్, బ్యూరో ఇన్‌చార్జి పిన్నింటి గోపాల్, యాడ్ మేనేజర్లు అప్పని సూరయ్య, శ్రీచరణ్ ఆనంద్, సామ సురేందర్‌రెడ్డి, సర్క్యులేషన్ మేనేజర్ ఎడెల్లి సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

# పొత్తు చిత్తుకు బీజేపీ ఎత్తు!

మొదటిపేజీ తరువాయి...

మాయావతి ఆశీర్వాదంతో 2021 ఆగస్టులో బీఎస్పీలో చేరానని అన్నారు. 4 వేల గ్రామాలు, 350 రోజులు లక్షల మందితో వందల సభలు పెట్టి బహుజనవాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లానని చెప్పారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థిగా తాను, 107 మంది అభ్యర్థులు బరిలో నిలిచారని తెలిపారు. తాము అనుకున్న విధంగా ఎన్నికల్లో ఫలితాలు రాలేదని వెల్లడించారు. పార్టీ ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు, ఎన్డీయే, ఇండియా కూటమితో కాకుండా ప్రాంతీయంగా పొత్తు పెట్టుకోవాలన్న మాయావతి సూచనలకు అనుగుణంగా బీఆర్ఎస్‌తో లోక్‌సభ ఎన్నికల్లో పొత్తు పెట్టుకున్నామని వివరించారు. రాష్ట్రంలోని అన్ని స్థాయిల క్యాడర్‌తో చర్చించి పొత్తు నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. పార్టీ కేంద్ర నాయకులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించామని అన్నారు. బీజేపీని నిలువరించేందుకే బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకున్నామని, కేసీఆర్‌తో చర్చల అనంతరం రెండు సీట్లు బీఎస్పీకి కేటాయించారని వివరించారు. నాగర్‌కర్నూల్, హైదరాబాద్ సీట్లను బీఆర్ఎస్ కేటాయించిందని, ఈ సమాచారాన్ని అందరికీ తెలిపామని అన్నారు. కానీ, తమ పొత్తు నచ్చని ప్రధాని మోదీ, అమిత్‌షా ద్వయం.. బీఎస్పీపై ఒత్తిడి తెచ్చారు. పొత్తు రద్దు చేసుకోవటం తనకు ఇష్టంలేదని స్పష్టం చేశారు. తాను మాయవతి, కాన్షీరాం లాంటి అనేకమంది స్ఫూర్తి పొందానని, ఒక్కసారి మాట ఇస్తే తప్పేది ఉండదని తేల్చిచెప్పారు. పొత్తు ధర్మం ప్రకారం ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా కలిసి నడవాల్సి ఉంటుందని అన్నారు. పొత్తు రద్దు చేసుకోవాలని తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా తాను బీఎస్పీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. తనకు అవకాశం కల్పించిన మయావతికి పాదాభివందనాలు తెలుపుతున్నానని ఆయన అన్నారు. బహుజనవాదం ఎప్పటికీ ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నానని వెల్లడించారు. త్వరలోనే శ్రేయోభిలాషులు, అభిమానులు, తనతో పాటుగా నడవాలని అనుకున్నవారితో సమావేశమై రాజకీయ భవిష్యత్తుపై నిర్ణయం తీసుకుంటానని అన్నారు. కేసీఆర్‌తో కలిసి పనిచేస్తామని చెప్పారు. ఎక్స్ వేదికగానూ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ స్పందించారు. 'భారమైన హృదయంతో బీఎస్పీని వీడుతున్నా. తప్పనిసరి పరిస్థితుల్లో, విధిలేక ఈ నిర్ణయాన్ని తీసుకున్నా. బీఎస్పీ-బీఆర్ఎస్ పొత్తును విచ్ఛిన్నం చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తున్నది. ఎన్నికల షెడ్యూల్‌కు కొన్ని గంటల ముంటు కవిత అరెస్టు ఇందులో భాగమే. బీజేపీ కుట్రలకు భయపడి నేను నమ్ముకున్న విలువలకు తిలోదకాలు ఇవ్వలేను. ఈ ప్రస్థానాన్ని ఆపను. స్వేరోస్ అందరూ ఈ నిర్ణయాన్ని అర్థం చేసుకుంటారని అనుకుంటున్నా' అని పేర్కొన్నారు.

## లోకం పోకడ




**కేసీఆర్‌ను ఎదుర్కోలేక కవితను అరెస్టు చేశారు**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకనే ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను దెబ్బతీయడానికే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయి. ఈడీ అధికారులు సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా కవితను అరెస్టు చేశారు. సాయంత్రం 6 గంటలకు మహిళలను అరెస్టు చేయడం అప్రజాస్వామికం. కోర్టులపై విశ్వాసం ఉంది. కవిత కేసులో న్యాయం గెలుస్తుంది.

-మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**కవిత అరెస్టు ముమ్మాటికీ కుట్రలో భాగమే**

పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వస్తున్న తరుణంలో బీఆర్ఎస్‌ను మానసికంగా దెబ్బతీయాలనే కుట్రలో భాగంగానే ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేశారు. లిక్కర్ కేసులో కవితను సాక్షిగా విచారిస్తున్న ఈడీ.. ఒక మహిళ హక్కులను హరించేలా అరెస్ట్ చేసింది. ఈడీ, ఐటీ, సీబీఐలను ప్రత్యర్థులపైకి ఉసిగొల్పి ప్రభుత్వాలను కూలగొడుతూ, దాడులు చేయిస్తూ.. కేసులలో ఇరికిస్తున్న ప్రధాని దుశ్చర్యలను ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలి.

-స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**అరెస్టు రాజకీయ కుట్ర**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కొనలేక నరేంద్ర మోదీ దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకొని అక్రమ అరెస్టులకు తెరలేపారు. వేల కోట్లు దోచుకుని దేశం విడిచి వెళ్లిపోతున్న వారిని వదిలిపెట్టి, కేసులో సాక్షిగా పిలిచిన ఆడబిడ్డను నిందితురాలిగా చేర్చి అరెస్టు చేయడం అక్రమం. సుప్రీం కోర్టులో ఈ నెల 19న వాదనలు ఉండగా, ఎన్నికల నోటిఫికేషన్ ఒక రోజు ముందు హడావుడిగా అరెస్టు చేయడం రాజకీయ కుట్రే. న్యాయ వ్యవస్థ మీద మాకు నమ్మకం ఉంది. ఎప్పటికైనా న్యాయం గెలుస్తుంది.

- ఎమ్మెల్యే పీ సబితా ఇంద్రారెడ్డి

**చూస్తూ ఊరుకోం..**

తెలంగాణ అస్థిత్వ పునాదులపై ఏర్పడిన బీఆర్ఎస్ పార్టీని నాశనం చేయాలని ఢిల్లీ పెద్దలు కుట్రలు పన్నుతున్నారు. తెలంగాణ ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీసేందుకే కవితక్కను అరెస్టు చేశారు. అసత్య ఆరోపణలు చేస్తూ అణిచివేయాలని చూస్తే.. తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదు. తెలంగాణ కోసం కొట్లాడిన వాళ్లకు జైలు గోడలు కొత్తకాదు. కవితక్క కడిగిన ముత్యం లెక్క బయటకు వస్తుంది. తెలంగాణ ఆడబిడ్డ కవితక్క అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం.

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

# మోదీ - ఈడీపై ఆగ్రహజ్వాల

మొదటిపేజీ తరువాయి...

గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పాల్గొన్నారు. పెద్దపల్లి,

జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, మహబూబాబాద్ జిల్లా తొర్రూరు, వరంగల్ జిల్లా వర్ధన్నపేట, హనుమకొండ, భూపాలపల్లి అంబేద్కర్ సెంటర్, మహబూబాబాద్, వరంగల్ జిల్లాకేంద్రం, కామారెడ్డి, ఎల్లారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట, నారాయణపేట ఖమ్మం జిల్లా మధిర, వైరా, కొత్తగూడెం, నల్లగొండ, దేవరకొండ, హాలియా, మిర్యాలగూ, భువనగిరి, ఉమ్మడి ఆదిలాబాద్, మెదక్, రంగారెడ్డి జిల్లాల వ్యాప్తంగా నిరసనలు జరిగాయి.

**హైదరాబాద్ నగరంలో..**

హైదరాబాద్ మహానగరంలో బీఆర్ఎస్ శ్రేణులు ఎక్కడికక్కడ నిరసనలతో కదం తొక్కాయి. 'మోదీకి బుద్ధి చెప్తాం.. కాంగ్రెస్ ఆటలు సాగనివ్వం' అంటూ నినదించాయి. నగర వ్యాప్తంగా జరిగిన నిరసనల్లో ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తెలంగాణ ఆడబిడ్డపై రాజకీయ కుట్రలు చేస్తున్న బీజేపీ ఆటలు తెలంగాణలో సాగనివ్వబోమని తెలంగాణ ఆటో మోటార్ డ్రైవర్స్ ట్రేడ్ యూనియన్ (టీఏటీయూ) అధ్యక్షుడు వేముల మారయ్య అన్నారు. కవిత అక్రమ అరెస్ట్‌కు నిరసనగా టీఏటీయూ ఆధ్వర్యంలో నాచారంలోని వైజయంతి చౌరస్తాలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను ఆటో డ్రైవర్లు దహనం చేశారు.

**నిరసనలో అపశ్రుతి..**

**బీఆర్ఎస్ కార్యకర్తకు మంటలు**

సిరిసిల్ల టౌన్, మార్చి 16: సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో అపశ్రుతి చోటుచేసుకుంది. మోదీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న క్రమంలో బీఆర్ఎస్ కార్యకర్త సాయికి మంటలు అంటున్నాయి. గమనించిన నాయకులు వెంటనే మంటలు ఆర్పి ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

# నిర్దోషిగా బయటకు వస్తా

## ఏ తప్పూ చేయలేదు.. న్యాయమే గెలుస్తుంది

- బీజేపీ రాజకీయ కుట్రతోనే ఈ అరెస్టు
- భారత జాగృతి సేవల్లో ఎక్కడా లోటు రానివ్వొద్దు
- కోర్టు ఆవరణలో జాగృతి, కుటుంబ సభ్యులతో కవిత
- ఈడీ కస్టడీలోనే ఎమ్మెల్సీ కవితకు వైద్యపరీక్షలు
- నేడు ఢిల్లీకి కేటీఆర్, హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): ఈడీ తనను అక్రమంగా అరెస్ట్ చేసిందని, దీనిపై న్యాయపోరాటం చేస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. న్యాయమే గెలుస్తుందని, తాను ఏ తప్పూ చేయలేదని అన్నారు. నిర్దోషిగా బయటకు వస్తానని, కేవలం రాజకీయ కుట్రతో తనను అరెస్టు చేశారని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు ఈడీని అడ్డం పెట్టుకొని కక్ష సాధిస్తున్నదని, ఇవన్నీ తాత్కాలికమైన అడ్డంకులని, వీటిని అధిగమిస్తానని ఆమె ధీమా వ్యక్తం చేశారు. న్యాయస్థానాలపై నమ్మకం ఉన్నదని, తప్పకుండా న్యాయం గెలుస్తుందని ఆమె వ్యాఖ్యానించారు. ఈడీ కార్యాలయం నుంచి రౌస్ ఎవెన్యూ కోర్టుకు వెళ్తున్నపుడు, కోర్టు హాలు వద్ద, రిమాండ్‌కు తరలించే సందర్భంగా కవిత అచంచలమైన ఆత్మవిశ్వాసంతోనే కనిపించారు. రిమాండ్ ఉత్తర్వులు వచ్చిన తర్వాత భర్త, కుటుంబ సభ్యులతో మాట్లాడేందుకు ఆమెకు అవకాశం ఇచ్చారు. ఈ సందర్భంగా కవిత తన వ్యక్తిగత సహాయకుడు శరత్‌తో మాట్లాడుతూ భారత జాగృతి సేవల్లో ఎక్కడా లోటు రానివ్వవద్దని, నిజామాబాద్ దవాఖాన తదితర ప్రాంతాల్లో జాగృతి అందించే భోజన వసతి కార్యక్రమాలను నిరాటంకంగా కొనసాగించాలని చెప్పారు. భారత జాగృతి తరపున ఇప్పటికే రూపొందించిన కార్యక్రమాలను నిర్వహించాలని, ఎక్కడా తాను అందుబాటులో లేనన్న భావన కార్యకర్తల్లో రానివ్వవద్దన్నారు. ఈడీ అధికారులు, కేంద్ర బలగాలు, ఢిల్లీ పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దారి పొడవున ప్రత్యేకంగా రోప్‌పార్టీలను నియమించారు.



శనివారం ఎమ్మెల్సీ కవితను ఢిల్లీలోని ఈడీ ఆఫీస్ నుంచి కోర్టుకు తీసుకెళ్తున్న అధికారులు

**ఈడీ కార్యాలయంలోనే వైద్యపరీక్షలు**

కవితకు ఈడీ కేంద్ర కార్యాలయం పరివర్తన్ భవన్‌లోనే శనివారం ఉదయం వైద్యపరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ వైద్యుల బృందాన్ని ఈడీ కార్యాలయానికి రప్పించిన అధికారులు అక్కడే ఆమెకు సాధారణ పరీక్షలు చేశారు. అనంతరం ఉదయం 11 గంటల ప్రాంతంలో రౌస్ ఎవెన్యూ న్యాయస్థానంలో ఆమెను హాజరుపరిచారు. ఇరు వర్గాలు తమ వాదనలు వినిపించాయి. న్యాయమూర్తి అనుమతితో కవిత తరపు న్యాయవాది విక్రం చౌదరి ఆమెతో ప్రత్యేకంగా ఐదు నిమిషాలు మాట్లాడారు. మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఇరుపక్షాల వాదనలు జరిగాయి. వాదనలు జరుగుతున్నంత సేపు కవిత కక్షిదారుల కోసం కేటాయించిన స్థలంలోనే కూర్చున్నారు. భోజన విరామం సమయంలో ఆమెను సందర్శకుల గ్యాలరీ వైపు వెళ్లేందుకు అనుమతించారు. అక్కడ కవిత భర్త అనిల్, ఎంపీలు కేఆర్ సురేశ్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, జాగృతి నేతలు రాజీవ్‌సాగర్. శరత్, న్యాయవాదులు భరత్, రామచందర్‌రావు, మోహిత్‌కు ఆమె అభివాదం చేశారు. కవిత చుట్టూ బందోబస్తుకు వచ్చిన పోలీసులు సందర్శకులు ఎవ్వరూ కస్టడీలో ఉన్న వ్యక్తులతో మాట్లాడవద్దని చెప్పడంతో వారు అభివాదం మాత్రమే చేశారు. తిరిగి సాయంత్రం 4.30 గంటల వరకు వాదనలు కొనసాగాయి. అనంతరం కవితను రిమాండ్ చేస్తున్నట్టు ప్రకటించిన జడ్జి అయిదు గంటలకు ఉత్తర్వులు జారీచేశారు. ఏడు రోజులపాటు ఈడీ కస్టడీకి ఇస్తున్నామని, 23వ తేదీ మధ్యాహ్నం మళ్లీ కోర్టులో హాజరుపరచాలని ఆదేశించారు. కస్టడీలో ఉన్నపుడు భర్త, కుటుంబ సభ్యులు, న్యాయవాదులను కలిసేందుకు సమయం ఇస్తామని, ఇంటి భోజనం అనుమతిస్తామని, వైద్యుల సూచన మేరకు అవసరమైన మందులను తెప్పించుకోవచ్చని చెప్పారు. వైద్యులు పరీక్షించినపుడు కవిత హైబీపీతో బాధపడుతున్నట్టు గుర్తించారు.

**న్యాయపరంగా ఎదుర్కోవడంపై చర్చ..**

ఈడీ ప్రత్యేక న్యాయస్థానంలో వాదనలు జరుగుతున్న తీరు, న్యాయపరంగా ఎలా ముందుకు వెళ్లాలన్నదానిపై కవిత తరపు న్యాయవాదులు సుదీర్ఘంగా చర్చించారు. శనివారం ఇదే అంశంపై న్యాయ నిపుణుల సలహాలు తీసుకున్నారు. సుప్రీం కోర్టుకు వెళ్లే అంశాన్ని పరిశీలిస్తున్నారు. సుప్రీంకోర్టుకు ఈ సమయంలో వెళ్లడం కరెక్టా.. కాదా అన్నదానిపై చర్చించారు. దీనిపై ఆదివారం ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నది.

**అన్యాయంగా అరెస్టు చేశారు: సురేశ్‌రెడ్డి**

ఎమ్మెల్సీ కవితను ఈడీ అధికారులు అన్యాయంగా అరెస్టు చేశారని బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి చెప్పారు. కవిత అరెస్టు రాజకీయ ప్రేరేపితమైనదని, సుప్రీంకోర్టులో ఒక వైపు విచారణ జరుగుతున్నపుడు మరోవైపు ఆమెను ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు కేవలం ఒక్కరోజు ముందు ఎలా అరెస్టు చేస్తారని, ఈ మొత్తం వ్యవహారాన్ని పార్టీ న్యాయపరంగానే ఎదుర్కొంటుందని చెప్పారు.

**బీఆర్ఎస్ పార్టీని టార్గెట్ చేసింది: ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్**

కేంద్రంలోని బీజేపీ సర్కారు ఈడీని అడ్డంపెట్టుకొని బీఆర్ఎస్ పార్టీని, కేసీఆర్‌ను ఇబ్బందిపెట్టాలని చూస్తున్నదని, దీంట్లో భాగంగానే కవితను అరెస్టు చేశారని ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ ఆరోపించారు. ఈడీ విచారణపై అనేక అనుమానాలున్నాయని, ఆ సంస్థ సుప్రీంకోర్టు ఆదేశాలను పట్టించుకోవడంలేదని అన్నారు. న్యాయస్థానంలో తమ వాదన గెలుస్తుందన్న ధీమాను ఆయన వ్యక్తంచేశారు.

**నేడు ఢిల్లీకి కేటీఆర్, హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి**

ఎమ్మెల్సీ కవితను ఈడీ కస్టడీలోకి తీసుకున్న నేపథ్యంలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ప్రశాంరెడ్డి తదితరులు ఆదివారం ఢిల్లీకి వెళ్లనున్నారు. కవితతో భేటీ అనంతరం న్యాయవాదులు, నిపుణులతో కూడా మాట్లాడుతారు. తదుపరి చేపట్టాల్సిన చర్యలపై ఒక నిర్ణయానికి వస్తారని తెల్సింది. న్యాయపరంగా ఎలా ఎదుర్కోవాలన్నదానిపైనే వీరు ప్రధానంగా దృష్టిసారించనున్నారు.

# ఇది అక్రమ అరెస్ట్

మొదటిపేజీ తరువాయి...

నిలిపివేయాలని, మొత్తం కేసునే కొట్టివేయాలని సుప్రీంకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశామని తెలిపారు. ఆ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో గత ఏడాది మార్చి 15 నుంచి విచారణ జరుగుతున్నదని వివరించారు. గత సెప్టెంబర్ 15న విచారణ సమయంలో.. ఈడీ తరపున అదనపు సోలిసిటర్ జనరల్ వాదనలు వినిపిస్తూ 'తదుపరి విచారణ వరకు కవితకు సమన్లు జారీ చేయము, అరెస్ట్ చేయబోము' అని ధర్మాసనానికి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. దీనిని దేశం మొత్తం చూసిందని అన్నారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంకోర్టులో వాదనలు పూర్తయ్యి కేసు వాయిదా పడిందని చెప్పారు. ఈడీ న్యాయవాదులే వాయిదాలు తీసుకున్నారని తెలిపారు. ఆ తర్వాత కొద్దిసేపటికే తెలంగాణలో కవిత నివాసంలో సోదాలు నిర్వహించారని, సాయంత్రం అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించారన్నారు. ఈడీ తాను ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేకపోయిందని, సర్వోన్నత న్యాయస్థానాన్ని వెక్కిరించిందని విమర్శించారు. కవితను సూర్యాస్తమయం తర్వాత అరెస్ట్ చేశారని చెప్పారు. అరెస్ట్ ఆర్డర్‌లో నమోదు చేసిన సమయాన్ని తప్పుబట్టారు. అధికారులు సాయంత్రం 5:20 గంటలకు అరెస్ట్ చేసినట్టు అందులో పేర్కొన్నారని, కానీ పంచనామాలో 6:45 గంటలకు సోదాలు ముగిశాయని తెలిపారు. ఒకవేళ 5:20 గంటలకే అరెస్ట్ పూర్తయితే.. మరో గంటకు పైగా సోదాలు ఎందుకు కొనసాగించారని ప్రశ్నించారు. సాయంత్రం 6:26 గంటలకే సూర్యాస్తమయం అయ్యిందని తెలిపారు. 'కవితను అరెస్ట్ చేయాలని ఎవరు నిర్ణయించారు?. మరో మూడు రోజులు ఎదురుచూసి, సుప్రీంకోర్టు నుంచి ఆర్డర్ తెచ్చుకోకుండా మిమ్మల్ని ఎవరు అడ్డుకున్నారు?' అని ప్రశ్నించారు. 'అరెస్ట్ చేయాలనుకుంటే సుప్రీంకోర్టుకు వెళ్లి అనుమతి తీసుకోవాలన్న కనీస మర్యాద పాటించలేదు. మీరే (ఈడీ) న్యాయమూర్తిగా, ధర్మాసనంగా, తలారిగా వ్యవహరించారు. ఇది తప్పు కాదా?' అని నిలదీశారు. మా విచారణకు రాకుండా కోర్టుకు వెళ్తారా.. ఎంత ధైర్యం అనే విధంగా ఈడీ అధికారులు వ్యవహరించారని అన్నారు. వారు రాతల్లో ఒకటి, మనసులో మరొకటి, చేతల్లో ఇంకొకటి చూపుతున్నారని విమర్శించారు.

**సాక్షినా.. నిందితురాలినా?**

ఇదే కేసులో సీబీఐ కవితను సాక్షిగా నమోదు చేసి సెక్షన్ 160 కింద నోటీసులు ఇచ్చిందని విక్రమ్‌చౌదరి గుర్తు చేశారు. 2022 డిసెంబర్‌లో అధికారులు ఆమె ఇంటికి వెళ్లి విచారించారని తెలిపారు. 'సీబీఐ సాక్షి అంటున్నది.. ఈడీ నిందితురాలు అంటున్నది.. ఏది నిజం?' అని ప్రశ్నించారు. ఒక మహిళను అరెస్టు చేసి, 30 కిలోమీటర్ల కన్నా ఎక్కువ దూరం తీసుకెళ్లాలంటే తప్పకుండా ట్రాన్సిట్ రిమాండ్ తీసుకోవాలని, కానీ అలాంటిదేమీ లేకుండా హైదరాబాద్ నుంచి ఢిల్లీకి తరలించారని వివరించారు. కవిత పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతుండగా.. మధ్యంతర ఉత్తర్వులు ఉండగా.. దర్యాప్తునకు ఆమె పూర్తిగా సహకరిస్తుండగా.. ఎందుకు అరెస్ట్ చేశారని ప్రశ్నించారు. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల్లో కవితకు అన్ని విధాలా రిలీఫ్ ఇచ్చిందని గుర్తుచేశారు. కవిత పిటిషన్‌పై ఈనెల 19వ తేదీన సుప్రీంకోర్టులో మరోసారి విచారణ జరుగనున్నదని, అప్పటి వరకు ఈడీ కోర్టులోని కేసు విచారణను నిలుపుదల చేయాలని, అరెస్టు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు.

**మా హామీ 10 రోజుల వరకు మాత్రమే..**

ఈడీ తరపున స్పెషల్ కౌన్సిల్ జోహెబ్ హుస్సేన్ వాదనలు వినిపిస్తూ.. కవితపై ఎలాంటి చర్యలు తీసుకోబోమని సుప్రీంకోర్టు సహా ఏ న్యాయస్థానానికీ ఈడీ హామీ ఇవ్వలేదని చెప్పారు. కవితకు సమన్లు ఇవ్వబోమని సెప్టెంబర్ 15న సుప్రీంకోర్టులో అదనపు సొలిసిటర్ జనరల్ ఇచ్చిన హామీ.. తదుపరి విచారణ వరకు మాత్రమేనని అన్నారు. అంతేతప్ప విచారణ మొత్తం ముగిసేవరకు కాదని తెలిపారు. 10 రోజుల తర్వాత ఆ హామీ గడువు ముగిసిందని చెప్పారు. ఆ తర్వాత కవితకు సమన్లు జారీ చేశామని, కానీ.. వాటిని సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా ప్రస్తావించలేదని తెలిపారు. కవితపై ఎలాంటి తీవ్రమైన చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు నుంచి మధ్యంతర ఉత్వర్వులు ఏమీ రాలేదని చెప్పారు. వారు చెప్తున్నవి కవిత దాఖలు చేసిన పిటిషన్‌కు సంబంధించినవి కాదని, నలినీ చిదంబరం పిటిషన్‌లో కోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను కవిత అన్వయించుకుంటున్నారని తెలిపారు. కవిత వేసిన ఇంప్లీడ్ పిటిషన్‌లో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేదని అన్నారు. ఈ కేసులో అరెస్టయిన ఇతర వ్యక్తులు ఇచ్చిన సమాచారం ఆధారంగా ఈ ఘటనలో కవిత పాత్ర ఉన్నదని ఈడీ నమ్ముతున్నదని తెలిపారు. కవిత రిమాండ్ రిపోర్ట్‌లో ఆమెను అరెస్ట్ చేయడానికి గల కారణాలన్నింటినీ పొందుపరిచామని తెలిపారు. సూర్యాస్తమయం తర్వాత అరెస్ట్ చేశారన్న వాదనలను సైతం ఖండించారు. సోదాల సమయంలో సోదరుడినని, బంధువులమని కొందరు వచ్చి అడ్డగించడం వల్ల ఆలస్యం అయ్యిందని అన్నారు. అరెస్ట్ చేసినవారిని 24 గంటల్లో కోర్టులో హాజరుపరచలేకపోతే మాత్రమే ట్రాన్సిట్ రిమాండ్ అవసరమని చెప్పారు. ఇరుపక్షాల వాదనలను విన్న అనంతరం కవితకు వారం రోజుల కస్టడీ విధిస్తూ జస్టిస్ ఎంకే నాగపాల్ తీర్పు వెలువరించారు.

**ఈడీ సమాచారమ్విలేదు**

కవితను శుక్రవారం రాత్రి ఈడీ కేంద్ర కార్యాలయానికి తరలించిన అధికారులు.. శనివారం ఉదయం వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ఢిల్లీ రౌస్ ఎవెన్యూలోని సీబీఐ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. వాదనలు ప్రారంభం కాగానే ఈడీ తమకు సరైన సమాచారం ఇవ్వలేదని విక్రమ్ చౌదరి పేర్కొన్నారు. ఆమెను న్యాయవాదితో కనీసం మాట్లాడనీయలేదని చెప్పారు. కాబట్టి కవితతో ఐదు నిముషాలు ప్రత్యేకంగా మాట్లాడేందుకు అనుమతి ఇవ్వాలని కోరగా.. న్యాయమూర్తి అనుమతించారు. కవిత భర్త అనిల్, మాజీ ఏఏజీ రామచంద్రరావు, న్యాయవాది మోహిత్‌రావు, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సోమభరత్, ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, సురేశ్‌రెడ్డి, బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ తదితరులు సైతం కోర్టుకు వెళ్లారు.